# 39. కూట్రువ నాయనారు

ఈ యోగి కాలందై ప్రధానాధికారి. మహాశివభక్తి దురంధరుడు. ప్రతిరోజు పంచాక్షరిని జపిస్తూ భక్తుల సేవ చేసేవాడు. దేవుడు ఆయనను సమర్ధవంతుడుగ, శక్తిమంతుడిగ, మహాధనవంతుడుగ చేశాడు. చోళ పాండ్య రాజ్యములలోని ప్రదేశములను చాల స్వాధీనము చేసికొన్నాడు. మూడువేల మంది బ్రాహ్మణులను తిల్లైలో (చిదంబరములో) తనను మూర్ధాభిషిక్తునిగా చేయనభిలషించాడు. వారలు చోళరాజు అధీనములో నున్నందున అంగీకరించలేదు. ఆయన ఆగ్రహముకు వెరచి - ఒక్కడు తప్ప అందరూ ఆ రాజ్యము వీడి వెళ్లిపోయారు. ఒక్కడే పూజకు మిగిలాడు. అతను కూడా నాయనారు కోరికను మన్నించలేదు. అందుకని ఒకరోజున నాయనారు దేవుని ప్రార్ధించాడు. ఆ ప్రార్ధన ఫలము అన్నట్లు దేవదేవుడే ప్రత్యక్షమయి తన కాళ్లను అతని తలపై పెట్టి అతనిని మూర్ధాభిషిక్తునిగా చేశాడు. నాయనారు శివుని నిరంతరము కీర్తిస్తూ అంత్యమున పరమ శివుని సాన్నిధ్యము చేరుకున్నాడు.

నాయనారు కోరికను ... మనలోనే వున్న దేవుడు అర్ధము చేసికొన్నాడు. మూడు వేల మందిని తనను మూర్ధాభిషిక్తునిగా చేయుమనుటలో - అతని ఉద్దేశ్యము కిరీటము దేవుని పాదల చిహ్నమని. బ్రాహ్మణులు భయపడగా దేవదేవుడు నిజముగా తన పాదాల్నే అతని శిరమున పెట్టాడు. నాయనారు కోరికను నెరవేర్చాడు.

***